# కల్తీ మిక్సర్, బూందీ తయారీ కేంద్రంపై దాడి



**మేడిపల్లి, క్విక్ టుడే :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో కల్తీ మిక్సర్, బూందీ తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆర్. గోవిందరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడలోని శ్రీసాయి నగర్ కాలనీలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా కల్తీ మిక్సర్, బూందీ తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో మేడిపల్లి ఆఫీసర్స్ సిబ్బందితో కలిసి మిక్సర్ తయారీ కేంద్రంపై దాడి చేశారు. అధికారుల సోదాల్లో 300 ప్యాకెట్లు మిక్సర్, 200 కిలోల బూందీ, 20 కిలోల పచ్చి బఠానీ, 50 కిలోల దాల్‌మోటి, 15 కిలోల పెసర, 20 కేజీలు మసాల పల్లీలు, 20 కిలోల గుర్రపు పప్పు, 5 కిలోల రాక్ సాల్ట్, 250 గ్రాముల గ్రీన్ కలర్ వంటి తయారీ పదార్థాలను గుర్తించారు. కల్తీ మిక్సర్ తయారీ నిందితుడు ఉప్పల్ చెందిన ఆంటోని అరుల్ శీలన్ పట్టురాజ్ అలియాస్ పట్టురాజ్ (57) ను అరెస్ట్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా సులభంగా డబ్బులు సంపాదించేందుకు అక్రమంగా వ్యాపారాన్ని ప్రారంభించి కల్తీ ఉత్పత్తులను దుకాణాలు, బేకరీలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ఆర్ గోవిందరెడ్డి తెలిపారు. ఎవరైనా ఇలా ంటి కల్తీ మిక్సర్ లాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.


# పోలీసు కుటుంబానికి రాచకొండ సీపీ ఆర్థిక సాయం



**హైదరాబాద్, క్విక్ టుడే :** అనారోగ్యంతో మరణించిన వలిగొండ పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ నూకల నర్సిరెడ్డి భార్య పద్మకు రాచకొండ పోలీసు కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం రాచకొండ పోలీసు కమిషనరేట్ కార్యాలయం (నేరేడ్ మెట్) లో భద్రత నుంచి రూ. 7.88 లక్షల చెక్కును ఇచ్చారు. వీరికి పెన్షన్, మిగతా బెనిఫిట్స్ త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాచకొండ సిపి సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది పెండింగ్ బిల్లుల గురించి చెప్పగా, సానుకూలంగా స్పందించారు. ఆర్థిక సంబంధిత అధికారులతో మాట్లాడి బిల్లులను పాస్ చేయిస్తానని ఈ సందర్భంగా సీపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్.భద్రా రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గుండాలలో మోక్షిత కలెక్షన్ ప్రారంభం

**గుండాల, క్విక్ టుడే :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో గోపాల్ దాస్ విజయకుమార్ కు చెందిన మోక్షిత కలెక్షన్ షాపును సోమవారం ఎస్.బి.ఐ గుండాల బ్రాంచ్ మేనేజర్ స్వామి ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల మండల కేంద్రంలో సాహసం చేసి బట్టల షాపు పెడుతున్నందుకు అభినందిస్తున్నానని అన్నారు. అవకాశాన్ని బట్టి ప్రతి ఒక్కరూ షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడం ద్వారా మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ.. మనం పోటీ ప్రపంచానికి దీటుగా వ్యూహ రచనలు చేసి అవకాశాలను బట్టి అనుభవం ఉన్న వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకొని ముందుకెళ్లాలని అన్నారు. చదువుకున్న మేధావులు ఆర్థికంగా బలపడేందుకు కృషిచేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎన్జీవో గ్రేస్ అధినేత డాక్టర్ బి. కొండల రావు పాల్గొని గోపాల్ దాస్ విజయకుమార్ సామాజిక అంశాలలో, వ్యాపార రంగంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిపురం దశరథ, మహిళా సంఘం నాయకురాలు సువర్ణ, అండాలు, మంజుల, మహంకాళి, పొన్నగాని యాదగిరి, బందెల సోమనర్సయ్య, చిప్పలపల్లి, అంబేద్కర్ పులి నర్సయ్య పాల్గొన్నారు.

# ఎంపీడీవోను సన్మానించిన గ్రామ పంచాయతీ కార్మికులు



**గుండాల, క్విక్ టుడే,** గుండాల మండలం ఎంపీడీవోగా ఇటీవలే బాధ్యతలు తీసుకున్న ఏ దేవిక ను గ్రామ పంచాయతీ కార్మిక యూనియన్ సభ్యులు గుండాల మండల కమిటీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ మండల ఉపాధ్యక్షులు ఇటికాల పరశురాములు, అన్నేపర్తి గిరిబాబు, నరసింహ చారి, మహేష్, రాజు, పాల్గొన్నారు.

### అదుపుతప్పి పల్టీ పడిన

# కారుకు మరోకారు ఢీ

**కొండపాక ఫిబ్రవరి 26** అదుపు తప్పిన కారు డివైడర్ కు ఢీ కొట్టి మరో వైపు రోడ్డుపైకి వెళ్లడంతో అదే సమయంలో అటువైపుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలైన సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు తిమ్మారెడ్డిపల్లి శివారులో అదుపుతప్పి డివైడర్ కు ఢీ కొట్టడంతో మరోవైపు రోడ్డు పై కి వెళ్లిన సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీ కొట్టి రోడ్డు కిందకు దూసుకుపోయి చెట్టుకు ఢీ కొట్టింది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ కు కారులో ప్రయాణిస్తున్న కరీంనగర్ డైరీ అడ్వైజర్ హనుమంత్ రెడ్డి 48, శోభన్ 44, ప్రశాంత్ 34 లతోపాటు హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో ఉన్న శోభన్ 36లకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ లు చేరుకొని కారులో నుంచి బయటకు తీసి గాయపడిన వారికి ప్రథమ చికిత్స.

# ఘనంగా పల్లవి మోడల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే





**బోడుప్పల్, క్విక్ టుడే :** బోడుప్పల్ లోని పల్లవిమోడల్ స్కూల్ లో శనివారం పాఠశాలలో ఉదయం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ దినోత్సవం "సంస్కృతి" అనే పేరుతో అతిపెద్ద వేదిక పైన ఘనంగా నిర్వహించారు. .దీనికి ముఖ్య అతిథులుగా ప్రముఖ మనస్తత్వవేత్త,కెరీర్ కౌన్సెలర్, నడవడికలో మార్పుల మెళుకువల అధ్యాపకుడు సుధీర్ సంద్ర, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి తనూజ విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంను ముందుగా దీప ప్రజ్వలనంతో ప్రారంభించి, తదనంతరం అతిథులను సత్కరిస్తూ స్వాగతం పలికారు. తరువాత విద్యార్థులు విభాగాల వారిగా వివిధ రకాలైన చక్కని నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రంలో ప్రీ ప్రైమరీ విద్యా విభాగంను ముగించుకొని ప్రాథమిక విద్యలోకి అడుగిడుతున్న చిన్నారులను ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలను ఇస్తూ సన్మానించారు. ప్రత్యేక ప్రతిభను కనబరిచిన ఉపాధ్యాయులను కూడా వేదిక పైన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సుధీర్ సంద్ర మాట్లాడుతూ విద్యార్థుల మనస్థత్వాలను బట్టి తల్లిదండ్రులు నడుచుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. నూతన పద్ధతుల ద్వారా పిల్లల సర్వతోముఖాభివృద్ధికి ఎలా కృషి చేయాలో తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి తనూజ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు వారిలో దాగిఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తామని తెలియజేశారు. పాఠశాలలో ఆటపాటలు కూడా ఎంతో అవసరమని వాటివల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా బలపడుతారని వివరించారు. చిన్నారుల ప్రతిభను గుర్తించి వారి సృజనాత్మకతకు గుర్తుగా విజేతలకు బహుమతులను అందించారు.

### మార్చి 1న నల్లగొండలో

# బీజేపీ విజయసంకల్పయాత్ర



**నల్లగొండ, ఫిబ్రవరి 26 (క్విక్ టుడే) :** ఈనెల 20న ప్రారంభమైన బిజెపి విజయసంకల్ప యాత్ర నల్లగొండ పార్లమెంటులో ఈనెల 28, 29,మార్చి 1 తేదీన వరకు కొనసాగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 17 పార్లమెంటు నియోజకవర్గాల్లోని 5 క్లస్టర్లలో ఈ యాత్ర ప్రారంభమైంది. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ నల్లగొండ పార్లమెంటు స్థానాలలో ఈ యాత్రకు కృష్ణా క్లస్టర్ గా నామకరణం చేయడం జరిగింది. ఇందులో భాగంగా నల్లగొండ నియోజకవర్గ పరిధిలో మార్చి 1 న నల్లగొండ పట్టణం పెద్ద గడియారం సెంటర్లో బిజెపి విజయసంకల్పయాత్ర సభను ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా సభకు సంబంధించి స్థానిక పెద్ద గడియారం సెంటర్లో స్థలాన్ని సోమవారం పరిశీలించారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాష్ట్ర మాదగోని శ్రీనివాస్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నరసింహారెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, నల్లగొండ పార్లమెంటు బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కనుమంత రెడ్డి శ్రీదేవి రెడ్డి, విజయ సంకల్పయాత్ర పూతపాక సాంబయ్య, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కంకణాల నాగిరెడ్డి, పెరిక ముని కుమార్. చింతా ముత్యాలరావు, కంచర్ల విద్యాసాగర్, లింగస్వామి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు మరణానికి మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలి

### బి ఎస్ పి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (క్విక్ టుడే) :** కనీస మద్దతు ధర చట్టం కోసం ఆందోళన చేస్తున్న రైతులపై హర్యానా పోలీసుల దాడిలో శుభ కరణ్ సింగ్ అనే రైతు మరణానికి బీజేపీ బాధ్యత వహించాలని బి ఎస్ పి నకిరే కల్ నియోజకవర్గం ఇంచార్జి మేడి ప్రియదర్శిని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రైతుల పై పోలీసుల దాడిని ప్రజాస్వామ్యవాదు లు మేధావులు అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. రైతుల సమస్యలను పరిష్కరించలేని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దాడి చేసి రైతులను చంపడం దుర్మార్గ చర్య అని అన్నారు. ఫిబ్రవరి 21న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టిన రైతాంగం పై పంజాబ్, హర్యానా సరిహద్దు. ఖీ నౌరి. వద్దా రైతాంగం పై పోలీసు యంత్రాంగం జరిపిన పాశావిక దాడులలో మరణించిన శుభ కరణ్ సింగ్ కుటుంబానికి సంతానం సంతాపాన్ని తెలిపారు. పోలీస్ కాల్పుల్లో మరణించిన శుభ కరణ్ సింగ్ కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించి పోలీసు కాల్పుల్లో క్షేత్రగాత్రులైన రైతు కుటుంబాలకు 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయం కేంద్ర ప్రభుత్వం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులపై కాల్పులు జరిపిన పోలీసులను తక్షణమే గుర్తించి వారిని ఉద్యోగం నుండి తొలగించవలసిన బాధ్యత మోడీ ప్రభుత్వంపై ఉందని అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

### పోలీస్ గ్రీవెన్స్ లో జిల్లా ఎస్పీ చందన దీప్తి



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (క్విక్ టుడే) :** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 40 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. సోమవారం వచ్చిన పిర్యాదులు భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యల పైన పిర్యాదులు రావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలని అన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

జన్మదిన, వివాహ
పదవీ విరమణ
శుభాకాంక్షలు

ఉద్యోగం, వ్యాపారం
రియల్ ఎస్టేట్
బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్ధంతి
శ్రద్ధాంజలి, నిర్యాణము

అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

# రైల్వే స్టేషన్ల ఆధునికరణతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

## రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్





**నల్గొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (క్విక్ టుడే)** : కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలంగాణలో రైల్వేస్టేషన్ల ఆధునికరణ చేపట్టడం హర్షదాయకమని, అధేవిధంగా ప్రయాణికులకు కూడా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ కోరారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునికరణకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా సోమవారం ప్రారంభించారు. నల్గొండ రైల్వే స్టేషన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రధాని మోడీ వర్చువల్ గా ప్రారంభించిన కార్యక్రమాన్ని తిలకించి మాట్లాడారు. రైల్వే స్టేషన్లలో సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు అన్ని వసతులను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రజల తరఫున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోనే 554 రైల్వేస్టేషన్లను పునర్నిర్మించే ప్రక్రియను ప్రారంభించారని, దేశవ్యాప్తంగా రైల్వే సెక్టార్ ను బ్రహ్మాండమైన అభివృద్ధి వైపు తీసుకు వెళుతున్నారన్నారు. కార్యక్రమంలో సీడీఎమ్ ప్రదీప్ కుమార్, పీడబ్ల్యూఐ రామభద్రరావు, స్టేషన్ మేనేజర్ సుధాకర్ బాబు, కమర్షియల్ సూపరింటెండెంట్ దేవ్ సింగ్, బీజేపీ నాయకులు కన్మంత రెడ్డి శ్రీదేవి రెడ్డి, పోతెపాక సాంబయ్య, యాదగిరి చారి, పోతెపాక లింగస్వామి తదితరులున్నారు.

# రైతులను కాల్చి చంపుతున్న మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

**సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి**

**రైతులపై కేంద్ర ప్రభుత్వము చేస్తున్న ధమన కాండను నిరసిస్తూ సిపిఐ ధర్నా**





**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (క్విక్ టుడే) :** స్వామినాధన్ కమిషన్ అమలు చేస్తామని గద్దెను ఎక్కినా బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర చట్ట భద్రత కోసం పోరాడుతున్న రైతులను కాల్చి చంపుతున్నా మోడీ కీ తగిన గుణపాఠం చెప్పాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి ప్రజానీకానికి పిలుపునిచ్చారు . ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం చేసున్న దమన కాండను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ఎదురు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పిస్తానని గతంలో పార్లమెంటు సాక్షిగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని రాజధాని కి తరలివస్తున్న రైతులను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో పార మిలిటరీని ఏర్పాటు చేసి ముళ్లకంచెలు పెట్టి 25 ఏండ్ల యువ రైతు శుభకరన్ సింగ్ ని పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. దేశ సంపదను అదాని అంబానీలకు కటాబేదుతున్న మోడీ రైతులకు మద్దతు ధర ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. స్వామినాధన్ కు మోడీ ప్రభుత్వం భారత రత్న అవార్డు ఇచ్చి కమిషన్ సిపార్స్ అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రైతు సమస్యలు పరిష్కరించాకుండా రైతు ఉద్యమాని ఉగ్రవాదులు గా దేశ దోహులుగా మోడీ ప్రభుత్వం చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.రైతు ఉద్యమాని అణిచివేస్తే ప్రయత్నం ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించేంతవరకు రైతుల పక్షాన ఉండి సిపిఐ పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు,ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా సహాయ కార్యదర్శి లు పల్లా దేవేందర్ రెడ్డి,లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు పబ్బు విరస్వామి,గురిజ రామచంద్ర%శీ%,బోడుపల్లి వెంకట్ రమణ,బోల్గురి నర్సింహా,టి వెంకటేశ్వర్ల,బంటు వెంకటేశ్వర్ల, నల్పరాజు రామలింగయ్య లు పాల్గొన్నారు.

# చనిపోయిన మిషన్ భగీరథ కార్మికురాలు డబ్బులు చెల్లించాలి

## ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి



**నల్లగొండ జిల్లా ప్రతినిధి. ఫిబ్రవరి 26.(క్విక్ టుడే) :** నల్లగొండ మిషన్ భగీరదలో పనిచేస్తున్న సింగం పుష్పలత గత 8 నెలల క్రితం చనిపోయిన అనంతరం జివిపిఆర్ కంపెనీ ఇస్తానని చెప్పిన రూ.8 లక్షల్లో కేవలం 6 లక్షలు మాత్రమే చెల్లించారని మిగతా రెండు లక్షల నేటికీ చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని తక్షణమే ఆ డబ్బులు ఇప్పించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు .సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చనిపోయిన సింగం పుష్పలత పిల్లలు కుటుంబ సభ్యులతో కలిసి ఏ వో మోతిలాల్ గారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పుష్పలత చనిపోయిన సందర్భంలో జివిపిఆర్ కంపెనీ వాళ్ళు మిషన్ భగీరథ ఎస్ ఈ డి ఈ ,ఎమ్మార్వో ల సమక్షంలో 8 రూపాయలు పరిహారంగా చెల్లిస్తామని మాట ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. ఎప్పుడు అడిగినా రేపు మాపు అంటూ కాలం వెళ్లబుచ్చుచున్నారని ఆరోపించారు. పిల్లల తల్లితండ్రులు ఇద్దరు మిషన్ భగీరథ లోనే ఉద్యోగాలు చేస్తూ చాలీచాలని వేతనాలతో సరైన సమయానికి వేతనము రాక అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారని ఆ చిన్నారి పిల్లల్ని ఆదుకోవాల్సిన బాధ్యత జివిపిఆర్ కంపెనీ పైనే ఉందనే పేర్కొన్నారు. కంపెనీ యాజమాన్యం మానవత్వం లేకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కేవలం 6 లక్షలు మాత్రమే చెల్లించి మిగతా డబ్బుల విషయంలో డ్రామాలాడుతున్నారని అన్నారు.తక్షణమే మిగతా రెండు లక్షల రూపాయల చెల్లించకపోతే కార్మికులందరూ ఏకమై సమ్మె చేపట్టాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఏవో మోతిలాల్ అక్కడే ఉన్న మిషన్ భగీరథ ఎస్ ఈ తో మాట్లాడి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి తక్షణమే డబ్బులు ఇప్పించాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి జానీ ,ఉయ్యాల రవి, %ఎ% సలీమ్,వేముల శేఖర్ కుటుంబ సభ్యులు సింగం లింగయ్య,చనిపోయిన పుష్పలత పిల్లలు సాన్విత, సాయి నందన్ ,సింగం వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**యువత ఎంప్లాయ్ గానే కాకుండా ఎంప్లాయ్ క్రియేటర్ గా ఎదగాలి**

**చదువుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు.**

**రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (క్విక్ టుడే) :** తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో టాస్క్, టి ఎఫ్ ఎం సి, జిల్లా యంత్రాంగం సంయుక్త



ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగం పెరిగిపోతున్న తరుణంలో నల్గొండ జిల్లా కేంద్రంలో తెలంగాణలోనే ఎక్కడ లేని విధంగా పెద్ద ఎత్తున సుమారు 13000 మందికి ఉద్యోగాలు కల్పించేలా 127 కంపెనీలను తీసుకువచ్చి నిరుద్యోగ యువతకి ఉపాధి కల్పించే జాబ్ మేళాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ జాబ్ మేళా ద్వారా లక్ష రూపాయల కనీసం వేతనం మొదలుకొని, 12 లక్షల రూపాయల వరకు సంవత్సరానికి జీతం వచ్చేలా కంపెనీలు ముందుకు వచ్చాయని ,ముఖ్యంగా టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, అరవింద వంటి పెద్ద పెద్ద కంపెనీలు సైతం ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్, సుభద్ర ఫౌండేషన్ ల ద్వారా గతంలో జిల్లాలో 18,410 ఉద్యోగాలు ఇచ్చి, సుమారు. రూ.3 నుంచి 15 లక్షల వరకు వేతనాలు ఇప్పించినట్లు గుర్తు చేశారు. అంతేకాక జేఎన్టీయూలో జాబ్ మేళా నిర్వహించి 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని మంత్రి వెంకటరెడ్డి తెలిపారు. యువత ఎంప్లాయ్ గానే కాకుండా ఎంప్లాయ్ థియేటర్ గా ఎదగాలి అన్నారు. ఉద్యోగం సాధించి పేదరికం నుంచి బయట పడాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ చేసుకొని ఉద్యోగాన్ని సాధించి మీ టాలెంట్ నిరూపించుకోవాలన్నారు. టాలెంట్ ఉంటే ఏ స్థాయికైనా ఎదగవచ్చు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెల వివిధ కంపెనీలతో జాబ్ నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంజి యూనివర్సిటీలో ఖాళీల బట్టి సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలో కాలేలాంటిని భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే సీఎం రిజిస్టర్ తీసుకెళ్లి 100 కోట్లు యూనివర్సిటీకి అభివృద్ధి కోసం కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నదని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న శక్తి సామర్థ్యాలను బయటకు తీసి బాగా కష్టపడి చదివి ముందుకెళ్లాలని ఆయన

చదువుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కష్టపడి చదువుకొని జాబ్ సంపాదించుకుంటూ మళ్లీ చదువుకుంటూ అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు.

తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండాలంటే

పిలుపునిచ్చారు. ఇకపై ప్రతినెల ఒక జాబ్ మేళాలను నిర్వహిస్తామని, వచ్చే నెల ఎన్జీ కళాశాలలో జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అంతకు ముందు మంత్రి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్ బ్రాంచ్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ , ఆంపి థియేటర్, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ నూతన భవనాలను ప్రారంభించారు. తెలంగాణలోనే మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాన్ని మంచి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతామని తెలిపారు . విశ్వవిద్యాలయంలో చేపట్టే ఇతర భవనాల కోసం 100 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, త్వరలోనే వీటి పనులు చేపడతామని తెలిపారు.

జిల్లా ఎస్పీ చందన దీప్తి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా ఒక మంచి అవకాశం అని, స్థానిక ప్రతిభకు తగ్గట్టుగా ఉద్యోగాలు దొరికే అవకాశం ఇక్కడి యువతకు దొరికిందని, అందరూ గర్వపడే విధంగా నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు .జిల్లాలోని యువత నైపుణ్యాలను వెలికి తీయడంలో భాగంగా మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందని తెలిపారు. టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ 127 కంపెనీలతో అతిపెద్ద జాబ్ మేళాను మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో ఉన్న ఇంజనీరింగ్ నైపుణ్యాలు ఎక్కడ లేవని అన్నారు.127 కంపెనీల ద్వారా 12743 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే



అవకాశాలు ఉన్నాయని ,లక్ష రూపాయలు మొదలుకొని, 12 లక్షల వరకు ప్యాకేజీ ఇచ్చే విధంగా కంపెనీలు ముందుకు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, విశ్వవిద్యాలయం ఉపకులపతి సిహెచ్ గోపాల్ రెడ్డి, టి ఎఫ్ ఎం సి, సి ఈ ఓ సత్యనారాయణ, ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి, నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రిశ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్ గౌడ్ ,ఇతర ప్రజాప్రతినిధులు ,అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మిక సంఘం జిల్లా చైతన్య సభలను జయప్రదం చేయండి



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (క్విక్ టుడే) :** కల్లుగీత కార్మిక సంఘం జిల్లా చైతన్య సభలను జయప్రదం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగానీ సీతారాములు గీత కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వృత్తిదారుల కార్యాలయం నల్లగొండలో జరిగిన ప్రెస్ మీట్ లో వారు మాట్లాడుతూ కల్లగీత కార్మిక సంఘం జిల్లా స్థాయి చైతన్య సభలను ఫిబ్రవరి 28వ తారీఖున నల్లగొండలోని యుటిఎఫ్ భవనంలో నిర్వహిస్తున్నామని ఈ చైతన్య సభలకు జిల్లాలోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంస్థల అధ్యక్షులు టిఎప్టి బాధ్యులు కల్లుగీతా కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ చైతన్య సభలలో కల్లు గీత కార్మిక పారిశ్రామిక సంఘాల విశిష్టత మరియు జీవోలు మనకు ఉన్న హక్కులు తదితర విషయాలపై అదేవిధంగా కల్లుగీతా కార్మికుల సమస్యలపై కేడర్ను సంసిద్ధత చేయుటకు చైతన్య సభలను జరుపుతున్నామని ఈ చైతన్య సభలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పామన గుండ్ల అచ్చాలు, సంఘం జిల్లా అధ్యక్షులు కొండా వెంకన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో ను

# విజయవంతం చేయాలి

### - వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ నాయక్

**నంగునూరు,పిబ్రవరి 26**

పోలియో నివారణ కోసం వచ్చే నెల మూడో తేది నుండి మూడు రోజుల పాటు చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మలేరియా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. సోమవారం నంగునూరు మండలం లో పల్స్ పోలియో పై ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.మండలంలో ఐదు సంవత్సరాల లోపు 3256 మంది చిన్నారులను గుర్తించినట్లు తెలిపారు.అప్పుడే పుట్టిన బిడ్డను మొదలుకొని ఐదు సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించేందుకు నాలుగు రూట్లుగా విభజించి 31 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుంద ని చెప్పారు.మొదటి రోజు పోలియో కేంద్రాల వద్దనే చిన్నారులు అందరికి చుక్కలు అందేలా చూడాలన్నారు. అన్ని నివాస ప్రాంతాల్లోని పిల్లలకు పోలియో చుక్కలు అందేలా 150 సిబ్బంది మరియు వాలంటీర్లను నియమిం చినట్టు తెలిపారు.ఇద్దరు వైద్య అధికారులు,నలు గురు సూపర్వైజర్ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.మాజీ ప్రజా ప్రతినిధులు,క్షేత్రస్థాయి అధికారులు కార్యక్ర మానికి సహకరించి విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని రాజగోపాలపేట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్,ఆశ వర్కర్ల కు పల్స్ పోలి యో పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో వేణుగోపాల్,ఎంఈఓ దేశి రెడ్డి, తహసిల్దార్,వైద్యాధికారులు డాక్టర్ అంజలి రెడ్డి,ఎంఎల్ హెచ్ పి శివకేశవరెడ్డి,సూపర్ వైజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.





## గ్రామ ప్రజలకు ప్రాణాంతకంగా మారిన

# రైస్ మిల్లును బంద్ చేయాలి

**కొండపాక ఫిబ్రవరి 26.**

రైస్ మిల్ నుండి వెలు వాడే దుమ్ము దూళి వల్ల వ్యాధులు ప్రబళి జీవించడాని కి ప్రమాదకరంగా మారుతుందన్నారు.బందారం గ్రామం నడిబొడ్డులో ఉన్న రైస్ మిల్లును తొలగించాలని సిద్దిపేట ప్రజావాణిలో గ్రామస్థులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.సిద్దిపేట జిల్లా కొండపాక మండల పరిధిలోని బందారం గ్రామంలో నడిబొడ్డున గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న రైస్ మిల్లు వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.ఇటీవల రైస్ మిల్లు ను మరింత గా విస్తారం లో అభివృద్ధి చేయడం తో దాని నుండి వెలువడే దుమ్ము ధూళి ఇండ్లలో పడి ప్రాణాంతక వ్యాధులతో పాటు ఉబ్బసం వంటి వ్యాధులకు గురైతునట్లు తెలిపారు.అంతేకాకుండా గాలి కాలుష్యంతో పాటు దుమ్ముదూలి బట్టల పై చేరి నీరు కలుషితం కావడం వల్ల ప్రమాదకరమైన రోగాల బారిన పడి ప్రజలు అవస్థలను ఎదుర్కుంటున్నట్లు వాపోయారు లక్షల పెట్టుబడు లతో ఇండ్లను నిర్మించుకొని నివసించడానికి వీలు లేక ఇండ్లను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పదుతుందని అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా విన్నవించామన్నారు.ఈ విషయం పై ప్రజా భవన్ లో పలుమార్లు ప్రజావాణిలో వినతి పత్రం అందజేసిన అధికారులు స్పందించడం లేదన్నారు.వెంటనే అధికారులు స్పందించి రైస్ మిల్లు పై చర్యలు తీసుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో బందారం గ్రామస్తులు మల్లారెడ్డి ,కరుణాకర్ రెడ్డి ,మల్లేశం,మాజీ ఉప సర్పంచ్ వెంకట్ ,పలువురు పాల్గొన్నారు



## జర్నలిస్ట్ శంకర్ గౌడ్ పై దాడి

# హేయమైన చర్య

### –మోకుదెబ్బ సెక్రటరీ కరుణకర్ గౌడ్



**దుబ్బాక, ఫిబ్రవరి 26, :**

హైదరాబాద్ ఎల్బీనగర్ లో తెలంగాణ ఎడిటర్ శంకర్ గౌడ్ పై దుండగులు దాడి చేసి కొట్టడం దుర్మార్గమైన చర్య అని గౌడ జన హక్కుల పోరాట సమితి (టీజీస్ ) మోకుదెబ్బ రాష్ట్ర సెక్రటరీ జనరల్ దొంతగౌని కరుణకర్ గౌడ్ అన్నారు . సోమవారం ఈ సందర్భంగా మాట్లాడుతూ ... నిజాలు చెప్పే జర్నలిస్ట్ లపై భౌతిక దాడులకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. తన కలం ద్వార అవినీతిని ప్రజలకు, ప్రభుత్వం తెలియచేస్తున్నాడనే కక్షతో కొందరు రౌడీలు దాడి చేసి కొట్టడం దారుణమన్నారు. నిశపక్షపాతంగా వార్తలు రాసే వారిపై దాడులు చేయడం వంటి చర్యలు పత్రికా స్వాతంత్రాన్ని హరించడమేనని ఆయన పేర్కొన్నారు. నియంత పోకడలు ప్రజాస్వా మ్య విధానానికి వ్యతిరేకమైనవన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్ట్ ల విషయంలో పాలకుల పోకడలు మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంఅధికారం లోకి వస్తే జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కారం చేస్తామని, పత్రికా స్వేచ్ఛను కాపాడతామని హామీలు ఇచ్చి, అధికారం లోకి వచ్చాక ఆ హామీలు గాలికి వదిలేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాల తప్పులను వార్తలతో ఎత్తి చూపితేనే పాలకులు సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్ట్ లపై దాడులు పాల్పడితే 10 సంహాత్సరాల జైలుశిక్ష అని ప్రకటించిన తర్వాత కూడా దాడులు జరగటం దారుణమన్నారు. ఏది ఏమైనప్పటికి పత్రికా, మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. జర్నలిస్ట్ శంకర్ గౌడ్ పై దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్ట్ లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

కొందరు దుండగుల దాడికి గురైన శంకర్ గౌడ్ కు గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ న్యాయం జరిగే వరకు అండగా ఉంటుందని దొంతగౌని కరుణకర్ గౌడ్ తెలిపారు.

## రూ.125.78 కోట్లతో

# నల్లగొండ మునిసిపల్ బడ్జెట్

### పన్నుల వసూలుతో ఆదాయం పెంచుకోవడంపై దృష్టి - వార్షిక బడ్జెట్ ను ఆమోదించిన సభ్యులు
### పాఠశాలలను బలోపితం చేయాలి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి. ఫిబ్రవరి 26 (క్విక్ టుడే) :**

నల్లగొండ మునిసిపల్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ను ప్రవేశపెట్టారు. గతేడాదికన్నా దాదాపు రూ.కోటి ఆదాయం అదనంగా వస్తుందని అంచనా వేస్తూ రూ. 125.78 కోట్లతో అంచనా బడ్జెట్ను రూపొందించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ సమావేశ మందిరంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బడ్జెట్ ము ఖ్యప్రతిని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రవేశపెట్టారు. 2023-24 సంవత్స రంలో రూ.52 కోట్ల 44 లక్షలు బడ్జెట్ ప్రవేశపెట్టగా వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 125 కోట్ల 78 లక్షలతో బడ్జెట్ను రూపొందించారు. గతంలో కన్నా పన్నుల రూపంలో ఎక్కువ ఆదాయం వస్తుందని చూయించారు. అంటే సాధార ణ పన్నులతో పాటు మొండిబకాయిల వసూళ్లపై మునిసిపల్ దృష్టి సారించబోతున్నట్లు స్పష్టమవుతోంది. పన్నులతోపాటు అద్దె ఆదాయం రూపంలో పెద్దఎత్తున బకాయిలు ఉండగా వాటి వసూళ్ళకు ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్ను పెంచుకోనున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుత సంవత్సరం ముగిసేనాటికి రూ.704.85 లక్షలు కోట్లు మిగులు బడ్జెట్ ఉండనుందని, ఈ బడ్జెట్ ప్రస్తుత అంచనా బడ్జెట్ రూ.11873.55 కోట్లు కలిపి రూ.12578.40 లక్షలతో బడ్జెట్ను ప్రవేశపెట్టారు. అదేవిధంగా ఈ ఏడాది ఖర్చులను అంచనా వేయగా రూ.5212.04 లక్షలు ఖర్చుగా చూయిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.772.83 లక్షలు మిగులు చూయించారు.





**పన్నుల రూపంలో....**

పన్నుల వసూలు ద్వారా ఆదాయం పెంచుకో వడంపై దృష్టి సారించారు. పన్నుల రూపంలో రూ.2750.00 లక్షలు ఆదాయం వస్తుందని, అద్దెల రూపంలో రూ.5.00 లక్షలు, పారిశుధ్య విభాగం ద్వారా రూ.60.00 లక్షలు, టౌన్ప్లా నింగ్ ద్వారా రూ.1600.00 లక్షలు , ఇంజనీ రింగ్ విభాగం ద్వారా రూ.60.00 లక్షలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. టౌన్ ప్లానింగ్ ఆదాయంపై ఈ ఏడాది పెద్దగానే ఆశ లు పెట్టుకున్నారు. గతేడాది బడ్జెట్లో టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.200.00 లక్షలు అంచనా వేయగా ఈఏడాది అదనంగా ఆదాయం వస్తు ందని అంచనా వేశారు. బడ్జెట్ను అన్ని పార్టీల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

**పాఠశాలలను బలోపితం చేయాలి:**
**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**

నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో 24 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, అందులో నాలుగు పాఠశాలలో మాత్రమే ఎక్కువ విద్యార్థులతో చదువుతున్నారని మిగతా 20 పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువైందని తెలిపారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు, పరిరక్షణ బాధ్యతగా తీసుకొని వెనుకబడిన పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు అభివృద్ధిపై సభ్యులంతా దృష్టి సారించాలని, వచ్చే ఏడాదికాలం అందరికీ చాలా ముఖ్యమైందని, ఈ ఏడాది చక్కగా పనులు చేసుకుంటే వచ్చే ఏడాది ఎన్నికలకు వెళ్లవచ్చని అన్నారు. సభ్యులు సూచించిన అన్ని సమస్యలను నోట్ చేసుకున్నామని, వాటన్నింటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ఉన్నతంగా బడ్జెట్ ను రూపొందించారన్నారు. నాలుగేళ్లుగా అభి వృద్ధికి దూరం గా ఉన్న కాలనీలు, మురికి వాడల అభివృద్ధికి ప్రాధా న్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాద్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**సమస్యలపై గళమెత్తిన కౌన్సిల్ సభ్యులు..**

నల్లగొండ పురపాలిక సమస్యలపై పార్టీలకతీతంగా సభ్యులు గళమె త్తారు. వార్డు సమస్యలతో పాటు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పలువురు సభ్యులు వార్డుల్లో నెలకొన్న సమస్యలు వివరించారు. నల్లగొండ పట్టణంలోని హిందూపూర్ స్మశాన వాటిక నిర్మాణంలో అవినీతి జరిగిందని వెంటనే విచారణ చేపట్టాలని అవార్డు కౌన్సిలర్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్ పేర్కొన్నారు.

**అందరికీ మాట్లాడే స్వేచ్ఛ: చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి**

సభ్యులు లేవనెత్తిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని వాటిని పరిష్కరిస్తామని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇది వరకు సభ్యులకు మాట్లాడే అవకాశం ఉండకపోయేదని, స్వేచ్ఛా పాలనలో సభ్యులంతా తమ సమస్యలను నిర్భయంగా చెప్పుకుంటున్నారని, ఇదే మార్పు అని చెప్పారు. గతంలో అభివృద్ధి పేరు చెప్పుకుని కాలనీలను పూర్తిగా విస్మరించారని ఇప్పుడు ఆ కాలనీలన్నీ అభివద్ధి చేసుకుందామని, పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ టిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లార్ లీడర్ అభిమాన శ్రీనివాస్, బిజెపి మున్సిపల్ లో లీడర్ బండారి ప్రసాద్ మున్సిపల్ అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ హెల్పర్లకు

# పాత పద్ధతిలో పదోన్నతి కల్పించాలి

### ప్రమోషన్ వయస్సు 50 ఏండ్లకి పెంచాలి
### కలెక్టరేట్ ముందు ధర్నా
### కలెక్టర్, డిడబ్ల్యూఓలకు వినతి




**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (క్విక్ టుడే) :**

అంగన్వాడీ హెల్పర్లకు ఎసెస్సీ అర్హతతో పాత పద్ధతిలో ప్రమోషన్ సౌకర్యం కల్పిస్తూ 50 సంవత్సరాల వరకు పరిమితి ఉండే విధంగా చూడాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె విజయలక్ష్మి కోరారు. సోమవారం తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేసి జిల్లా కలెక్టర్, జిల్లా శిశు సంక్షేమ అధికారి లకు వినతి పత్రం సమర్పించడం జరిగింది . ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి,కె విజయలక్ష్మి లు మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఈ మధ్యకాలంలో ఐసిడిఎస్ 9వేల అంగన్వాడీ ఉద్యోగుల పోస్టులు ఖాళీ ఉన్నాయని ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే వెంటనే భర్తీ చేస్తామని ప్రకటించిందని సంతోషం. కానీ ఇదే సమయంలో అంగన్వాడీ కార్యకర్తలకి ప్రమోషన్ సౌకర్యం, విద్యార్హత %టూజ% ఉన్న దానిని ఇంటర్ కి మార్చారు.దీనివల్ల అనేక సంవ్సరాల తరువాత వస్తున ఖాళీ పోస్టుల భర్తీ ద్వారా వచ్చే ప్రమోషన్ సౌకర్యనికి ఎక్కువమంది అంగన్వాడీ హెల్పర్స్ ప్రభుత్వం చేసిన నిర్ణయంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరణ చెయ్యాలని,పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో సుమారు 70వేల మంది అంగన్వాడీ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఇందులో సగం మంది అంగన్వాడి హెల్పర్లు గత 45 సంవత్సరాలు పైగా అంగన్వాడి కేంద్రాల్లో పనిచేస్తున్నారు. వీరికి గతంలో ఎస్ఎస్సి అర్హత ప్రకారం టీచర్ గా ప్రమోషన్స్ సౌకర్యం ఉండేది. గత ప్రభుత్వం 2022 డిసెంబర్ లో విద్యార్హతను ఇంటర్ గా మార్చింది. అంగన్వాడీ టీచర్ పోస్ట్ భర్తీ చేయాలంటే ఇంటర్ ఉండాల్సిందేనని ప్రభుత్వం అంటుంది. ఐసిడిఎస్ పట్ల ఎలాంటి అవగాహన లేని ప్రజల నుండి కొత్తగా వచ్చే వారికి సంవత్సరాలకు పైగా ఐసిడిఎస్ లో అంగన్వాడి కేంద్రాలను అంటిపెట్టుకొని పనిచేస్తూ టీచర్లు ప్రభుత్వం చెప్పిన అదనపు పనులు చేయడానికి బయటకు వెళ్లినప్పుడు ఆయా సమయాల్లో టీచర్ల పనులు కూడా హెల్పర్లు నిర్వహిస్తూ ఐసిడిఎస్ పైన అపార అనుభవం ఉన్న హెల్పర్లకు పాత కొత్త ఇద్దరికీ ఏ తేడా లేకుండా ఒకే రకమైన విద్యార్హత ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయడం అత్యంత అన్యాయం. కొత్త, పాత తేడా లేనప్పుడు ఇది ప్రమోషన్స్ సౌకర్యం ఎలా అవుతుందో ప్రభుత్వం పరిశీలించాలి. ప్రమోషన్ అంటేనే కార్మికులు పనిచేసిన కాలాన్ని సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలి. దీనినే కోలబద్దగా చూడాలి. అంతేతప్ప కీలకమైన ఈ అంశాలను పక్కనపెట్టి విద్యార్థులను ముందుకు తేవడం అంటే అంగన్వాడి హెల్పర్లకు అన్యాయం చేయడం తప్ప మరొకటి కాదనిఅన్నారు. ఇప్పటివరకు విద్యార్హత ఎస్ఎస్సి పెట్టి ఉన్నపలంగా రెగ్యులర్ ఇంటర్ ఉండాలంటే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు సేవలందించే హెల్పర్స్ రెగ్యులర్ ఇంటర్ ఎలా చేస్తారు ప్రభుత్వం చేసిన నిర్ణయం సరైందిగా లేదు. ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక తదితర అనేక రాష్ట్రంలో ఎస్ఎస్సి అర్హత ప్రకారమే హెల్పర్ను ప్రమోషన్ ఇస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అంగన్వాడీ హెల్పర్లకు న్యాయం చేయాలని, పాత పద్ధతి ఎస్ఎస్సి అర్హత ప్రకారమే ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.. రాష్ట్ర ప్రభుత్వ సానుకూలంగా ఈ సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని , లేనిచో రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు దండెంపల్లి సత్తయ్య, ఏర్పుల యాదయ్య , జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, పోలే సత్యనారాయణ, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నల్గొండ ప్రాజెక్టు అధ్యక్షురాలు పి సరిత, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.సునంద, హెల్పర్స్ ఎం సుజాత ,భాను చంద్ర, అండాలు ,రేవతి, వెంకటమ్మ, యాదమ్మ, ఇందిరా, ఎల్లమ్మ, వజ్రమ్మ, లక్ష్మీ ,పద్మ, సుమలత, అనసూయ, సరిత, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ కు ఓటేస్తే
# అడక్కతినుడు ఖాయం

- కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా
- కేంద్రంలో వచ్చేది బీజేపీయే
- దేశంలో అందరి మనసు గెల్చుకున్న నాయకులు ప్రధాని మోదీ
- బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్
- బీజేపీ తోనే దేశాభివృద్ధి సాధ్యం : బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ
- సిద్దిపేట పట్టణానికి చేరుకున్న బీజేపీ విజయ్ సంకల్ప యాత్ర
- బ్లాక్ ఆఫీస్ నుండి శివాజీ చౌక్ వరకు ర్యాలీ

**సిద్ధిపేట, ఫిబ్రవరి 26**

కేంద్రంలో కాంగ్రెస్ వచ్చే పరిస్థితి లేదని, కాంగ్రెస్ కు ఓటేస్తే అడక్కతినుడు, అప్పుల పాలవ్వడం ఖాయమని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. బీజేపీ విజయ్ సంకల్ప యాత్ర సోమవారం సిద్ధిపేట పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా బ్లాక్ ఆఫీస్ చౌరస్తా నుండి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈటెల మాట్లాడుతూ దేశంలో అందరి మనసు గెలిచిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచి మూడు నెలలు అయినా రూ. 4వేల పెంషన్ ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తే నేను రాజకీయాల నుండి తప్పుకుంటా నని సవాల్ విసిరారు. మోడీ పేదింటి బిడ్డ, దొర ఇంటి బిడ్డా కాదని, సిద్ధిపేట, హైదరాబాద్ లో కట్టిన ఇండ్లు కేసీఆర్ కట్టించిన వాటి కంటే మోడీ కట్టించనవే ఎక్కువగా ఉన్నాయన్నారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఉంటే ఎక్కువగా ఇండ్ల నిర్మాణం జరిగేవని, విదేశాల్లో శిక్ష అనుభవిస్తున్న సైనికులను మోడీ రక్షించి భారత్ కి తెచ్చాడన్నారు.



**బీజేపీ తోనే దేశాభివృద్ధి సాధ్యం : రాణి రుద్రమ**

దేశాభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమని పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. అత్యధిక పార్లమెంట్ స్థానాలను తెలంగాణ నుండి సాధించి మూడోసారి కేంద్రంలో అధికారం లోకి రాబోతున్నామని ధీమా వ్యక్తంచేశారు. దేశ సమగ్రత, మనందరి బాగు కోసం కేంద్రంలో మూడోసారి బీజేపి అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్ గుడిని మింగితే బీఆర్ఎస్ గుడిలోని లింగం మింగిందని విమర్శించారు. దేశ రక్షకుడు నరేంద్ర మోడీ అని కొనియాడారు. కరోనా లాంటి విపత్తుల నుండి మనల్ని మోడీ కాపాడాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి బసవ లక్ష్మి నరసయ్య, బీజేపి జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి,దూది శ్రీకాంత్ రెడ్డి, వంగ రాంచంద్రారెడ్డి, విద్యాసాగర్,అసెంబ్లీ ఇంచార్జు జాలిగామ ఉపేందర్,బైరి శంకర్ ముదిరాజ్,కొత్తపల్లి వేణుగోపాల్, సురేష్ గౌడ్,గుండ్ల జనార్థన్, సంతోష్,కోడూరి నరేష్,దినేష్,నవీన్ రెడ్డి,మర్కేండేయులు, తాటికొండశ్రీనివాస్ బీజేపీనాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

- గుడికి వెళ్ళొచ్చే సరికి ఇల్లు కాలింది
- దుబ్బాక పట్టణంలో ఘటన
- రూ. ఐదు లక్షల వరకు నష్టం
- షార్ట్ సర్క్యూట్ తోనే ఇల్లు దగ్ధం : ఆర్ఐ నరసింహ రెడ్డి



**దుబ్బాక, ఫిబ్రవరి 26**

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం దుబ్బాక పట్టణం 15వ వార్డులో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... దుబ్బాక పట్టణానికి చెందిన గాజుల నరేష్ ఇంట్లో దేవుడికి దీపం ముట్టించి భార్య భర్తలిద్దరు దేవాలయానికి వెళ్లి వచ్చే వరకు ఇల్లు మొత్తం కాలిపోయింది. చుట్టుపక్కల ఉన్న వారు ఫైర్ ఇంజన్ ను రప్పించి మంటలు అర్పించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఈ ప్రమాదం జరిగిందని దుబ్బాక ఆర్ ఐ నరసింహారెడ్డి పంచనామా చేసిన అనంతరం తెలిపారు. ఇల్లు దగ్ధంతో ఇంట్లో ఉన్న వస్తువులతో పాటు, నగదు దగ్ధమైందని, రూ. ఐదు లక్షల వరకు నష్టపోయానని బాధితుడు నరేశ్ వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని 15 వార్డు కౌన్సిలర్ పల్లె మీనా రామస్వామి గౌడ్ కోరారు.



## అర్హులైన జర్నలిస్టులకు
# ఇళ్ల స్థలాలు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి కి వినతి
- ఇళ్ల స్థలాల అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని అదనపు కలెక్టర్ కు మంత్రి ఆదేశం

**హుస్నాబాద్, ఫిబ్రవరి 26**




అర్హులైన జర్నలిస్టుల కు ఇళ్ల స్థలాలు అందించి లబ్ది పొందేలా చూస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీనిచ్చారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను హుస్నాబాద్ జర్నలిస్ట్ హక్కు పోరాట సమితి సంఘం అధ్యక్షులు బానోతు హనుమంతు నాయక్, ప్రధాన కార్యదర్శి వంగ రాజు తో పాటు పలువురు జర్నలిస్ట్ లు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం జర్నలిస్టులు పొన్నం ప్రభాకర్ తో మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణ శివారు కిషన్ నగర్ లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద గత ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన 40 డబుల్ బెడ్ రూమ్ ల పంపిణీలో చాలా అవకతవకలు జరిగాయని, వాటిపై సరైన విచారణ జరిపి అర్హులైన జర్నలిస్టుల అందరి కీ ప్రభుత్వం నుంచి ఇండ్లు, ఇండ్ల స్థలాల పట్టాలను అందించాలని మంత్రి కోరారు. స్పందించిన మంత్రి అర్హులైన జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాల సంబంధించిన జాబితాలో చేర్చాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సమగ్ర విచారణ జరిపి అర్హులైన జర్నలిస్టులందరికీ లబ్ధి చేకూరేలా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ నర్సింగ్, బత్తుల జగదీశ్, పెరుమాండ్ల భరత్, వేణు, సది గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ
# విగ్రహం ధ్వంసం

- బక్రిచెప్యాల లో ఘటన
- గ్రామంలో పనిచేయని సీసీ కెమెరాలు
- ఘటన స్థలిని పరిశీలించిన త్రీ టౌన్ పోలీసులు




**సిద్ధిపేట, ఫిబ్రవరి 26**

గుర్తు తెలియని దుండగులు జాతి పిత మహాత్మగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటన సోమవారం సిద్ధిపేట అర్బన్ మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం తెల్లవారుజామున గద్దెపై ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం పూర్తిగా పక్కకు ఒరిగి ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున చేరుకొని విషయాన్ని ఆరా తీశారు. విషయం తెలుసుకున్న ఎమ్మార్వో సలీం, గ్రామ స్పెషల్ ఆఫీసర్ రాజేశం, సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ వద్ద బాలవికాస ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ను పరిశీలించారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఇతర టెక్నాలజీ సాయంతో నిందితులను గుర్తించే ప్రయత్నం చేయనున్నారు. గతంలో కూడా ఒకసారి గాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడానికి ప్రయత్నం చేశారని, విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయంలో గ్రామంలో గ్రామస్తులను అడిగి కొన్ని విషయాలను తెలుసుకున్నామని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు.



విగ్రహ సమీపంలో బెల్టు షాపులు ఉండడంతో లేట్ నైట్ వరకు మద్యం సేవించి మద్యం మత్తులో ఇటువంటి సంఘటనలకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నామని సీఐ తెలిపారు. ఏదేమైనా పూర్తి స్థాయిలో విచారణ జరిపి త్వరలోనే దుండగులను పట్టుకుంటామన్నారు.

## ప్రజా వాణి ధరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి
## ప్రజావాణిలో కలెక్టర్ అనురాగ్ జయంతి

**రాజన్న సిరిసిల్ల జిల్లా** ప్రజావాణికి వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల అలాగే హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో నిర్వహించిన ప్రజావాణికి ఇప్పటిదాకా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పెండింగ్ ఉన్నాయి? వాటికి సరైన కారణాలు తెలుపుతూ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో సుప్రీం, హైకోర్టు ల కేసులు ఎన్ని పెండింగ్ ఉన్నాయి? వాటి వివరాలు ఇవ్వాలని, ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 29 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖకు 17, డీపీఓకు 5, సర్వే, డీఎం హెచ్ ఓ, సెస్, నీటి పారుదల, ఎంపీడీఓ, సిరిసిల్ల మున్సిపల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జెడ్పీ సీఈవో ఉమారాణి, డీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ వీర బుచ్చయ్య, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ గారి అధ్వర్యంలో డి ఐ ఈ ఓ కి వినతి పత్రం

**రాజన్న సిరిసిల్ల జిల్లా:** విద్యార్థులకు ఇంటర్ హాల్ టికెట్లు కొరకై ఇంటర్ విద్యార్థులను కొన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న కాలేజ్ యాజమాన్యాలు హాల్ టికెట్ల విషయంలో ఇబ్బందులు గురిచేస్తున్నారు అని పరీక్ష సమాయల్లో ఇలా చేయడం వల్ల విద్యార్థులు మానసికంగా ఇబ్బందులకు గురి అవుతున్నారు అని ఎగ్జామ్స్ పట్ల సరిగా దృష్టి పెట్టలేక పోతున్నారు అని కాబట్టి అట్టి కళాశాల ల మీద చర్యలు తీసుకోవాలని విద్యార్థుల బంగారు భవిష్యత్తునీ దృష్టిలో ఉంచుకొని వారికి వెంటనే హాల్ టికెట్లు ఇవ్వలని కోరడం జరిగింది పరీక్షల సమయంలో వారిని ఇబ్బందికి గురి చేయకుండా చూడాలని దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది దీనికి గాను డి ఐ ఈ ఒ గారు సానుకూలంగా స్పందించి విద్యార్థులు ఎలాంటి ఆందోళనల చెందవద్దు అని కళాశాలల యాజమాన్యాలు ఫీజుల విశయం లో కానీ ఇతర ఏ విశయం లో అయిన ఇబ్బందులు పెట్టిన తన దృష్టికి తీసుకురావాలని అంతే కాకుండా విద్యార్థులు డైరెక్ట్ గా ఆన్లైన్ సెంటర్లో హాల్ టికెట్స్ డౌన్లోడ్ చేసుకోవచ్చు అని కళాశాల ప్రిన్సిపాల్ సంతకం కూడా అవసరం లేదు అని చెప్పడం జరిగింది .ఇంటర్ విద్యార్థులు అందరూ దీనిని గ్రహించి తమ దృష్టిని విద్య పైన పెట్టీ మంచిగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరడం జరిగింది